www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 28 ఆగస్టు 2023
5
చిత్తూరు

నేడు జగనన్న విద్యాదీవెన ప్రారంభం

జిల్లాలో 31,180 మందికి రూ.22కోట్లు లబ్ది: కలెక్టర్

చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి ఈనెల 28వ తేదీ సోమవారం చిత్తూరు జిల్లా నగరి నుండి జగనన్న విద్యా దీవెన ఏప్రిల్ - జూన్ 2023 త్రైమాసిక లబ్ధిని కంప్యూటరులో బటన్‌నొక్కి ప్రారంభిస్తారని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో అన్ని వర్గాల పేదవిద్యార్థుల ఉన్నత చదువులు వారి తల్లిదండ్రులకు ఆర్థికంగా భారం కాకూడదని, డిగ్రీ ఆపై చదువులు చదువుతున్న విద్యార్థులకు పేదరికమే కొలమానంగా కోర్సుతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం పూర్తి ఫీజురీయింబర్స్‌మెంట్ అందించే కార్యక్రమాన్ని ఫిబ్రవరి 24, 2020న ప్రారంభించిందని, ఇందులో భాగంగా ఏప్రిల్-జూన్ 2023 త్రైమాసికానికి సంబంధించి ఫీజురీయింబర్స్ మెంట్ కింద జిల్లాలోని 34,388 మందికి విద్యార్థులు సంబంధించి 31,180 మంది తల్లుల ఖాతాలకు రూ.22 కోట్లు జమ కానున్నదని తెలిపారు.

డెయిరీ కార్మికుల ఆకలి కేకలు

బకాయిల కోసం ఆందోళన బాట



విజయ సహకార డెయిరీ (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

దేశంలోనే అతిపెద్ద పాల డెయిరీ అయినటువంటి విజయ సహకార డెయిరీ కార్మికులు ఆకలి కేకలు పెడుతున్నారు. ఏండ్ల తరబడీ జీతాల కోసం పోరాటాన్ని సాగించిన కార్మికులకు జగన్ పాదయాత్ర సందర్భంగా ఇచ్చి హామీ వీరికి ఊపిరి పోసినట్లు అయ్యింది. విజయ సహకార డెయిరీకి పూర్వవైభవం సంతరించుకుంటుందని భావించిన కార్మికుల ఆశలు ఆవిరయ్యేలా గతేడాది జూలై 4వ తేది అమ్యూల్‌కు 99 ఏండ్లు లీజుకు ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం తీర్మాణం చేసింది. నాటి నుండి తమ బకాయిలు చెల్లించాలంటూ 140 కార్మిక కుటుంబాలు పోరాడుతున్నాయి.

ఇదిగో.. అదిగో.. అంటూ రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు కాలయపన చేస్తున్నార తప్ప సమస్యల పరిష్కారం కాలేదు. కాగా ఇటీవల అమూల్ సంస్థకు జిల్లా కేంద్రమైన చిత్తూరులో నిర్వహించిన బహిరంగ సభలో విజయ సహకార డెయిరీ కార్మికులను బకాయి జీతాలు చెల్లింస్తామని సిఎం సమక్షంలో నేరుగా సిఎం ఇచ్చేస్తారంటూ జిల్లా అధికారులు నమ్మబలికారు. గంపెడు ఆశతో సిఎం సభకు చేరుకున్న డెయిరీ కార్మికులను పోలీసులు సిఎం సభ ముగిసేంత వరకు బలవంతంగా అదుపులోకి తీసుకుని దూరంగా వదిలేశారు. అప్పటికి అర్ధమైంది రాష్ట్ర ప్రభుత్వం కుట్ర.. నాటి నుండి తమకు చెల్లించాల్సిన బకాయిల కోసం పోరాడుతూనే ఉన్నారు.

అయితే విద్యాదీవెన పథకాన్ని ప్రారంభించేందుకు మరో మారు నగరికి రానున్న రాష్ట్ర ముఖ్యమంత్రి తమ బకాయిల చెల్లింపుపై స్పష్టత ఇవ్వాలని విజయ డెయిరీ కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో మరో మారు విజయ సహకార డెయిరీ (ప్రస్తుత అమూల్ డెయిరీ) ఎదుట రిలే నిరాహార దీక్షలకు పూనుకొనేందుకు సిద్ధం అవుతున్నారు.

140 కార్మిక కుటుంబాల ఆకలి కేకలు

2002 ఆగస్టు 31న సహకార విజయ డెయిరీ మూత పడింది. ఆనాటికి 592మంది కార్మికులు డెయిరీలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారు. ఉన్నఫలంగా డెయిరీ మూతపడ్డంతో వీరి జీవితాలు ప్రశ్నర్థకంగా మారాయి. ఇందులో 452 మంది కార్మికులు విఆర్‌ఎస్ తీసుకున్నారు. విఆర్‌ఎస్ తీసుకోవడం ఇష్టం లేదని 140మంది కార్మికులు నాటి నుండి రాష్ట్ర ప్రభుత్వం అమూల్ సంస్థకు అప్పగించేత వరకు సుదీర్ఘ పోరాటం సాగింస్తున్నారు. 2002 నుండి సహకార విజయ డెయిరీ కోసం పోరాడుతున్న కార్మికుల్లో వివిధ కారణాలతో 21 మంది మృతిచెందారు. మృతుల కుటుంబాలతో పాటు మిగిలిన కార్మికుల బకాయి జీతాలు సుమారు రూ.53కోట్లు చెల్లించాల్సి ఉంది. తమకు కార్మికచట్టాల ప్రకారం బకాయి వేతనాలు చెల్లించాలని కార్మికులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

మృతి చెందిన 21 కార్మికులు

విజయ సహకార డెయిరీని తెరిపించాలంటూ 140మంది కార్మికులు 2002 నుండి సుదీర్ఘ పోరాటాన్ని సాగించారు. ఇందులో 21 మంది కార్మికులు మరణించారు. మరణించిన వారి కుటుంబాలు ఎప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తమ బకాయిలు చెల్లిస్తుందని ఎదురు చూస్తున్నారు. కార్మిక కుటుంబాలు ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ ఆకలి కేకలు పెడుతున్నాయి. మూడు పూటలా తిండి కోసం చిన్నాచితక పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఎప్పటికైనా తమకు చెల్లించాల్సిన బకాయిలు తిరిగి చెల్లిస్తారని ఎదురు చూస్తున్నారు.

డెయిరీ పునఃప్రారంభం కోసం పోరాటంలో మృతి చెందిన 21 మంది వీరే : నారాయణస్వామి, రాజారత్నం, అంజి, సయ్యద్ అహ్మద్, దేవరాజు రెడ్డి, మునిరాజ, రఘు, రమేష్ బాబు, మునస్వామి, షణ్ముగం, సుబ్రమణ్యం, మధుసూదన్, చిన్నప్ప, నాగరాజ, సుబ్రమణ్యంరెడ్డి, నారాయణ, శశిల్‌పాల్, భాస్కర్, మునియప్ప, సుబ్రమణ్యం

బకాయిల కోసం పోరాటం చేస్తున్న డెయిరీ కార్మికులు, మద్దతు తెలిపిన వివిధ పార్టీల నాయకులు (ఫైల్‌ఫోటో)

నేడు నగరిలో సీఎం పర్యటన

ప్రజాశక్తి- నగరి : సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటనకు సర్వం సిద్ధమైంది. నగరిలో సోమవారం అట్టహాసంగా జరగనున్న జగనన్న విద్యాదీవెనను లాంఛనంగా ప్రారంభించడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాల్గొనున్న విషయం తెలిసిందే. దీనికి అవసరమైన అన్ని ఏర్పాట్లను జిల్లా అధికార యంత్రాంగం పూర్తిచేసింది. ఆదివారం నగరిలో ఏర్పాట్లు జరుగుతున్న తీరును డిప్యూటీ సీఎం నారాయణస్వామి, రాష్ట్ర అటవీ, విద్యుత్, పర్యావరణ శాస్త్ర సాంకేతిక భూగర్భ గనులశాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాష్ట్ర సాంస్కృతిక, యువజనాభివద్ధి శాఖ మంత్రి ఆర్కే రోజా, ఎంపీలు మిధున్ రెడ్డి, రెడ్డెప్ప, సీఎం కార్యక్రమాల సమన్వయకర్త తలశీల రఘురాంలు జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్, ఎస్పీ వై. రిశాంత్ రెడ్డి, ఇతర జిల్లా ఉన్నతాధికారులతో కలిసి పర్యవేక్షించారు. సభాప్రాంగణాన్ని, హెలిపాడ్‌లను, ఏర్పాటు చేసిన గ్యాలరీలను పరిశీలించారు. ముఖ్యమంత్రి హోదాలో నగరికి తొలిసారి వస్తున్న జగనన్న సభను నభూతోనభవిష్యత్ అన్న స్థాయిలో నిర్వహించేందుకు ప్రజాప్రతినిధులు విశేషంగా కషిచేస్తున్నారు. సభకు భారీగా ప్రజలు రానున్నందున వారికి ఏ ఇబ్బందీ లేకుండా అన్ని చర్యలు చేపట్టారు. ఏరియా ఆస్పత్రిలో వీఐపీ వార్డులను సిద్ధం చేశారు. సీఎం పర్యటన నిమిత్తం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఎం పర్యటన నిమిత్తం విధి నిర్వహణకు విచ్చేసిన పోలీసులకు స్థానిక డిగ్రీకళాశాల మైదానంలో ఎస్పీ సూచనలు అందించి విధులను కేటాయించారు. హెలిప్యాడ్‌కు విచ్చేసే హెలికాప్టర్, ముఖ్యమంత్రి కాన్వాయ్‌ల ట్రయల్ రన్ చేశారు.

బహిరంగ సభ వద్ద భారీగా పోలీసుల బందోబస్తు

సిద్ధమైన సభావేధిక

నగరి- పుత్తూరు మార్గం షిరిడిసాయి దివ్యదామం సమీపం ఏర్పాటుచేసిన బహిరంగసభా వేధిక అందంగా ముస్తాబైంది. జిల్లావ్యాప్తంగా వచ్చే ప్రజలు, విద్యార్థులు కూర్చునేందుకు వీలుగా అధికారులు సర్వంసిద్ధం చేశారు. బైక్‌లు, పెద్దవాహనాల పార్కింగ్‌కు స్థలాలను కేటాయించారు.

ఎన్నికల హామీలను 99 శాతం పూర్తి చేశాం..

ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు : పెద్దిరెడ్డి

ప్రజాశక్తి- నగరి: విద్యారంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టి పలు సంస్కరణలు చేపట్టి విద్యారంగ అభివద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్.జగన్ మోహన్‌రెడ్డి విశేష కషి చేస్తున్నారని రాష్ట్ర విద్యుత్, అటవీ, పర్యావరణ శాస్త్ర, సాంకేతిక, భూగర్భ గనుల శాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఈనెల 28వ తేదీన జగనన్న విద్యా దీవెన ఏప్రిల్- జూన్ 2023 త్రైమాసిక లబ్ధిని ముఖ్యమంత్రి రాష్ట్రవ్యాప్తంగా చిత్తూరు జిల్లా నగరి నుండి లాంఛనంగా ప్రారంభించనున్న నేపథ్యంలో ఆదివారం బహిరంగ సభ, హెలిప్యాడ్ వద్ద శరవేగంగా జరుగుతున్న ఏర్పాట్లను డిప్యూటీ సిఎం కె.నారాయణస్వామి, రాష్ట్ర అటవీశాఖ మంత్రి, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా, చిత్తూరు ఎంపి రెడ్డెప్ప, సీఎం కార్యక్రమాల సమన్వయకర్త ఎమ్మెల్సీ తలశీల రఘురాం, జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్, ఎస్పీ వై.రిశాంత్ రెడ్డిలతో కలసి పరిశీలించారు. ఈసందర్భంగా అందరితో సమావేశమైన ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటనను అందరూ సమన్వయంతో విజయవంతం చేస్తామన్నారు. ముఖ్యమంత్రి పర్యటన నగరి నియోజకవర్గ ప్రజల్లో ఉత్సాహాన్ని నింపుతుందన్నారు. ఎన్నికల హామీలను 99 శాతం పూర్తి చేశామని, అభివద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని అన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలలో వివిధ అభివద్ధి కార్యక్రమాలను చేపట్టారని అన్నారు. విద్యారంగ అభివద్ధిలో భాగంగా ప్రభుత్వం అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, జగనన్న గోరుముద్ద, నాడు-నేడు తదితర కార్యక్రమాలను అమలు చేయడం జరుగుతున్నదన్నారు. ఎంఎల్‌సి భరత్, తంబళ్లపల్లి, సత్యవేడు ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి, ఆదిమూలం, డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్, పంచాయతీ రాజ్ ఎస్‌ఈ చంద్రశేఖర రెడ్డి, జడ్పీసీఈవో ప్రభాకర్ రెడ్డి, డీపీవో లక్ష్మీ, డీపీఎంవో షణ్ముగం, నగరి, కుప్పం ఆర్‌డిఓలు సుజన, శివయ్య, తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంక్రటామిరెడ్డి, ఎంపీడీవో లీలామాధవి పాల్గొన్నారు.

హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న మంత్రులు, కలెక్టర్, ఎస్పీ

'సీఎం గారు.. సమస్యలపై స్పందించండి'

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడగంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

జిల్లా పర్యటనలో భాగంగా రెండవసారి రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం జగన్మోహన్ రెడ్డి నగరికి వస్తున్న సందర్భంగా జిల్లాలో ఉన్న సమస్యలపై దష్టి పెట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నగరి ప్రాంతంలో ఉన్న వేలాది మంది పవర్లూమ్ కార్మికులకు విద్యుత్తు ఛార్జీలు 500యూనిట్లు వరకు ఉచితంగా ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, కూలి రేట్లు పెంచాలని పోరాటం చేసిన ఫలితంగా అధికారులతో ఒప్పందమై సంవత్సరం దాటుతున్న ఇప్పటివరకు కూలి రేట్లు అమలు చేయలేదని అన్నారు. ప్రస్తుతం ఉన్న రేట్లకు అనుగుణంగా రేట్లు పెంచాలని, నింద్ర మండలంలో ఉన్న షుగర్ ప్యాక్టరీ చెరకు రైతులకు బకాయిలు ఇవ్వాలని, ఎక్స్ప్రెస్ హైవే కోసం భూములు ఇచ్చిన రైతులకు నష్టపరహారం చెల్లించాలని, జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులైన హంద్రీనీవా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని, పుంగనూరు ప్రాంతంలో చింతపండు కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. చిత్తూరు జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, జిల్లాలో ఉన్న వేలాదిమంది కార్మికులకు అనుకూలంగా వైద్యం అందించడానికి ఇఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని, జిల్లాలో పారిశ్రామిక వాడలను అభివద్ధి చేయాలని, పట్టు రైతులకు బకాయిలు ఉన్న 60 కోట్ల రూపాయల ప్రోత్సాహక రుణం వెంటనే ఇవ్వాలని, ప్రభుత్వ పాఠశాలలో కాలేజీల్లో అధిక ఫీజులు అరికట్టాలని, జిల్లా సమగ్ర అభివద్ధి కోసం జిల్లాకు ప్రత్యేకంగా రెండు వేల కోట్లు కేటాయించి అభివద్ధి చేయాలని కోరారు. ఈ సమస్యలపై సిఎ స్పందించాలని డిమాండ్ చేశారు.

సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి

ఫ్రైడే డ్రైడే పాటించాలి: డాక్టర్ ప్రభావతిదేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వర్షకాలంలో సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశం ఎక్కువగా ఉంటుంది. సీజనల్ వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఈ మేరకు వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించి సీజనల్ వ్యాధుల సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేయడం జరుగుతోంది. ఇందు కోసం ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే పాటించి ఇల్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొనేలా ప్రజల్లో అవగాహన పెంచుతున్నామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ప్రభావతిదేవి ప్రజాశక్తి ప్రత్యేక ఇంటర్వ్యూలో తెలిపారు. కొన్ని ప్రదేశాల్లో ప్రత్యక్షంగా పాల్గొని దోమలు వృద్ధిచెందే పూలకుంటీలు, పాత టైర్లు, కొబ్బరి చిప్పల్లో ఉన్న నీటిని పారపోసి దోమల నివారణకు సహకరించాలని కోరారు. ఇందుకు ప్రజల సహకరిస్తున్నారని, ఆరోగ్య సంరక్షణ కోసం ఫ్యామిలీ డాక్టర్ పేరుతో జిల్లాలోని 32 మండలాల్లో 44 సంచార వాహనాల ద్వారా 55 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైఎస్‌ఆర్ విలేజ్ హెల్త్‌క్లీనిక్‌ల ద్వారా సచివాలయస్థాయిలో ప్రతిగడపకు వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. 464 మంది మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ ద్వారా గ్రామీణ స్థాయిలో వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి: జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రు ఎన్ని.. ఎలాంటి వైద్యసేవలు అందుతున్నాయి?

డిఎంఅండ్‌హెచ్‌ఒ: జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 48, అర్బన్ ప్రాంతాల్లో 14 ప్రాథమిక ఆరోగ్యో కేంద్రాలున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీల్లో 24 గంటల పాటు వైద్యసేవలు అందించేలా చర్యలు చేపట్టాం. ప్రసూతి సేవలపై దృష్టి సారిస్తున్నాం. గతంలో నమోదైన మతాశిశుమరణాల కారణాలపై అధ్యయం చేసి పునరావృతం కాకుండా చూస్తున్నాం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెరిగేలా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. హైరిస్కు కేసులను మాత్రమే ఇతర ఆస్పత్రులకు సిపార్సు చేస్తున్నాం.

ప్రజాశక్తి : జనని సురక్ష యోజన ఎలాంటి కార్యక్రమాలు చేస్తున్నారు?

డిఎంఅండ్‌హెచ్‌ఒ: జననీ సురక్ష యోజన పథకం కింద ఇప్పటివరకు 2,835 మందికి రూ.22లక్షలు చెల్లించాం. నులిపురుగుల నివారణ కార్యక్రమం ద్వారా ఈ ఏడాది ఆగస్టు నెలలో రెండవ విడతలో 2,420 పాఠశాలలో 2,40,981 మంది విద్యార్థులు, 137 కళాశాలల్లో 43,586 మంది విద్యార్థులు 2,632 మంది బడి బయట పిల్లలకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశాం.

ప్రజాశక్తి: క్షయవ్యాధి నివారణ కోసం ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

డిఎంఅండ్‌హెచ్‌ఒ: 2030 నాటికి క్షయరహిత ఆంధ్రప్రదేశ్‌గా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ఇందులో భాగంగా ఈ సంత్సరం జూలై నెల వరకు 14,256 మంది క్షయ వ్యాధి లక్షణాలున్న వారికి పరీక్షలు చేశాం. నిక్షయ్‌పోషణ కార్యక్రమం ద్వారా పోషకాహారం, ప్రోత్యాహకాలు ఇస్తున్నాం.

ప్రజాశక్తి: మాత శిశు సంరక్షణ కార్యక్రమం ఎలా జరుగుతోంది?

డిఎంఅండ్‌హెచ్‌ఒ: మాతా శిశు సంరక్షణలో భాగంగా ఈ ఏడాది జులై వరకు 2,895 సాధారణ ప్రసవాలు, 1,791 సీజేరియన్ ద్వారా ప్రసవించిన వారికి సేవలు అందించాం. చిత్తూరు, కుప్పంలోని ఆసుపత్రులలో రోగులకు ఉచితంగా కిడ్నీ డయాలసిస్ వైద్యసేవలో భాగంగా 39,423 హీమో డయాలసిస్ సెషన్‌లు నిర్వహించాం. డాక్టర్ వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా 3,255జబ్బులకు ఉచిత వైద్యం అందిస్తున్నాం. వైఎస్‌ఆర్ ఆసరా క్రింద జిల్లాలో ఇప్పటి వరకు 46, 873 మందికి రూ. 25 కోట్లు ఖర్చు చేశాం.

డాక్టర్. ప్రభావతిదేవి
జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారిణి

భారీగా పతనమైన 'టమోటా' ధరలు

నష్టాలతో దిగాలు పడ్డ రైతన్నలు

ప్రజాశక్తి- వికోట:

గడచిన రెండు నెలలుగా ప్రజలకు చుక్కలు చూపించిన టమాటా ధరలు.. భారీగా పతనం కావడంతో అప్పులు చేసి పంట సాగు చేసిన రైతన్నలు నష్టపోయి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. మండల కేంద్రమైన వికోటలోని వ్యవసాయ ఉపమార్కెట్‌లో టమాటాలు ఇటీవల వరకు కిలో రూ.200ల వరకు ధర పలికింది. దీనికి తోడు గత నాలుగు నెలలుగా టమాటాకు అధిక ధర రావడంతో రైతులు పోటీపడి పంట సాగు చేపట్టారు. టమాట సాగు విస్తీర్ణం ఇటీవల పెరిగిపోవడంతో మార్కెట్‌కు ఎక్కువగా టమోటాలు రావడంతో ధరలు అమాంతం పడిపోయాయి. ఇటీవల వరకు బెంగళూరు, చెన్నైకి చెందిన వ్యాపారస్తులు పోటీపడి తక్కువ సరుకు అందుబాటులో ఉండటం వలన డిమాండ్ ఎక్కువగా ఉంది. దీంతో 16 కేజీల బాక్స్ టమాటాను రూ.2500ల వరకు కొనుగోలు చేశారు.

రీటైల్ మార్కెట్లో రెండో రకం టమాటాలు రూ.200ల వరకు విక్రయాలు జరిగాయి. ఇదే అదనుగా భావించి మండల పరిధిలో రైతులు అప్పులు చేసి భారీగా పెట్టుబడులు పెట్టి పంట సాగుచేశారు. ఆంధ్ర సరిహద్దు కర్ణాటక రాష్ట్రం నుండి కూడా రైతులు తమ పంటలను వీకోట మార్కెట్‌కు తరలించడంతో డిమాండ్ తగ్గి ధరల పతనానికి కారణమయ్యాయి. చింతామణి, మదనపల్లి, శ్రీనివాసపురం, అనంతపురం తదితర ప్రాంతాల్లో దిగుబడులు అధికంగా రావడం వల్ల కూడా ధరలు పతనమయ్యాయి.

వి.కోట మార్కెట్లో టమాటాలకు వేలం నిర్వహిస్తున్న వ్యాపారులు

మొదటి రకం కాయలు ప్రస్తుతం 16 కేజీల బాక్స్ రూ.350ల వరకు విక్రయిస్తున్నట్లు వ్యాపారాలు తెలిపారు. దీనితో పెట్టిన పెట్టబడులు రాకపోగా కూలీలు, రవాణా ఖర్చులు కూడా భారంగా మారాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఆగస్టు నెలలో సమద్ధిగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండి లోతట్టు ప్రాంతాలు మడికట్టు తడిగా మారడంతో మెట్టప్రాంతాల్లో మాత్రం టమోటా సాగు చేసేవారు. సాధారణ వర్షాలకు పంట దిగుబడులు తగ్గి ధరలు పెరిగేవని మార్కెట్‌లోని వ్యాపారస్తులు తెలిపారు. అయితే ప్రస్తుతం నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో అన్ని రకాలు నేలల్లో పంట విస్తీర్ణం పెరిగి దిగుబడులు అధికం కావడమే ధరల పతనానికి ప్రధాన కారణంగా రైతులు భావిస్తున్నారు. ప్రభుత్వం రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు వెళ్లేలా అవగాహన కల్పించి టమాట సాగు రైతులకు సబ్సిడీలు అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పెట్టుబడులు కూడా వచ్చే అవకాశం లేదు..
- పిఎన్.నాగరాజు, రైతు వీకోట

ప్రతి సంవత్సరం ఇదే సీజన్లో టమటా సాగు మొదలు పెడతాను. దీనివల్ల ఇతర ప్రాంతాల్లోని పంటలు ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల సాగు విస్తీర్ణం తగ్గుతుంది. దీనితో జూన్, జూలై, ఆగస్టు మాసాల్లో ధరలు ఉంటుండేవి. అయితే ఈ సంవత్సరం ఆరు ఎకరాల్లో పెద్ద ఎత్తున ఖర్చు చేసి పంట సాగు చేశాను. అయితే ఎక్కువ మంది రైతులు టమాట సాగుకు మొగ్గు చూపడంతో ధరలు పతనమై ఈసమస్య ఏర్పడింది. దీనికి తోడు నాణ్యమైన వంగడాలు నాటడంతో 80 రోజుల్లో వాతావరణం అనుకూలించి మంచి దిగుబడి వచ్చింది. ఇదే సమయంలో ఇతర ప్రాంతాల్లో పంట దిగుబడి భారీగా పెరగడం కూడా ధరలు పతనానికి కారణమయ్యాయి. ప్రస్తుతం ధరలు పతనం కావడంతో పెట్టుబడులు కూడా వచ్చే అవకాశం లేక ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి నెలకొంది.

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి..
- చలపతి, రైతు, బి.కొత్తకోట

నాకున్న మూడు ఎకరాల వ్యవసాయపొలంలో వివిధరకాల కూరగాయలు పండిస్తుంటాను. గత ఏడాది ఇదే సీజన్లో టమాట సాగు చేయడం వల్ల అధిక దిగుబడులు రావడంతో మంచి ధరలు వచ్చాయి. ఈ సంవత్సరం కూడా రెండు ఎకరాల్లో టమాటా సాగు చేశాను. కూలీల ఖర్చులు, ఎరువులు, పురుగు మందులతో పాటు ఇతర ఖర్చులు భారీగా పెరిగాయి. అయితే పంట కోతకు వచ్చిన దశలో గత పది రోజులుగా ధరలు పతనం కావడంతో పెట్టుబడులు కూడా రాక తీవ్రంగా నష్టం వాటిల్లే పరిస్థితి నెలకొంది. దీన్ని అధిగమించేందుకు ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నాను.

నీతి పద్యాలు దారి చూపే నేస్తాలు...

పి.తులసీనాధం నాయుడు

ప్రజాశక్తి- పలమనేరు: పిల్లలు నేర్చుకునే నీతిపద్యాలు భవిష్యత్తుకు దారి చూపే నేస్తాలని తెలుగు సాహిత్య సాంస్కతిక సమితి అధ్యక్షులు పి.తులసీనాధం నాయుడు అన్నారు. ఆదివారం కళామందిరంలో తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర, జిల్లాస్థాయి పద్యాల పోటీ నిర్వహించారు. ఈ పోటీలో 80 మంది విద్యార్థులు 100 నుండి 200 వరకు పద్యాలను అవలీలగా చెప్పగలిగారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పద్యాలు నేర్చుకోవడం వల్ల నైతిక విలువలు అలవడటంతోబాటు ధారణాశక్తి పెరుగుతుందన్నారు. హరివిల్లు వ్యవస్థాపకులు మహాకవి మునస్వామి తెలుగుభాషా చరిత్రను, పద్యాలలోని రకాలను శ్రావ్యంగా పాడి వినిపించారు. 80మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు, పుస్తక బహుమతులను సంస్థ కార్యదర్శి పుష్ప అందించారు. మొదటి 5స్థానాలలో నిలిచిన సాయి ధ్యాన్‌చంద్, జైవర్ధన్, పావని, లక్ష్మశ్రీ, డింపుల్‌లకు బహుమతులతో పాటు రూ.500ల నగదు అందించారు. కార్యక్రమంలో చంద్రశేఖరయ్య, కళావతి, జొన్నవిత్తుల శ్రీరామ చంద్రమూర్తి, శివశంకర్ రెడ్డి, సుదర్శనారి, ముద్దుకష్ణ, జయలక్ష్మి, సాధనకుమార్, తదితరులు పాల్గొన్నారు

తెలుగు సాహిత్యంలో నల్లాపల్లి విద్యార్థుల ప్రతిభ

ఎస్‌ఆర్ పురం: తెలుగు సాహిత్య సాంస్కతిక సమితి ఆధ్వర్యంలో నల్లాపల్లి పాఠశాల చెందిన విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి బహుమతులు పొందారు. మండలంలోని నల్లాపల్లి పాఠశాలకు చెందిన విద్యార్థులు పలమనేరులోని కళామందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి పద్యాలు పోటీల్లో నాలుగవ తరగతి చెందిన రితిక, హరిప్రియ, ఐదవ తరగతి యామిని పోటీలలో పాల్గొని తెలుగు సాహిత్య సాంస్కతిక సమితి ఆధ్వర్యంలో బహుమతులు పొందారు.

ఎమ్మెల్సీ కంచర్లను కలిసిన పార్టీ శ్రేణులు

ప్రజాశక్తి -పాలసముద్రం: కుప్పం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ చైర్మన్, పట్టభద్రుల ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ప్రభావశీలుల గుర్తింపు కార్యక్రమ కార్యాచరణ గురించి చర్చించడానికి కుప్పంలోని వారి కార్యాలయంలో రాష్ట్ర తెలుగుదేశంపార్టీ ప్రభావశీలుల గుర్తింపు కార్యక్రమ సభ్యులు భీమనేని చిట్టిబాబు కలిశారు. వారి వెంట రాష్ట్ర టిఎన్ఎస్ఎఫ్ అధికార ప్రతినిధి లోకేష్ రావిళ్ళ, గురుప్రసాద్, ఢిల్లీ బాబు, హేమంత్, శ్రీనివాస్, తేజ, వెంకటేష్ పాల్గొన్నారు.

వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులుగా శరత్ రెడ్డి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులుగా శరత్‌రెడ్డిని ఎంపిక చేయడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు శరత్‌రెడ్డి ఆదివారం పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నారని రాబోవు ఎన్నికల్లో వైఎస్ఆర్‌సిపి పార్టీకి గ్రామస్థాయి నుంచి బలోపేతం చేస్తామని రాబోయే ఎన్నికల్లో తిరిగి జగన్మోహన్‌రెడ్డిని సీఎం చేస్తామని ఆయన తెలిపారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పాలకొల్లు రామచంద్రారెడ్డి, వైస్ఎంపీపీ శిరీష్ రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రకాష్‌రెడ్డి, ప్రవీణ్ రెడ్డి దొరస్వామి తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలోకి 26 వైసిపి కుటుంబాల చేరిక

ప్రజాశక్తి- గుడిపల్లి: మండలంలోని సంగనపల్లి గ్రామపంచాయతీ పెద్దపర్తికుంట గ్రామానికి చెందిన 26 వైసిపి కుటుంబాలను ఆదివారం కుప్పం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, తెలుగుదేశం పార్టీ కుప్పం నియోజకవర్గ విస్తరణ కమిటీ కన్వీనర్ సురేష్ బాబు సమక్షంలో పసుపు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో సమన్వయ కమిటీ కన్వీనర్ చంద్రశేఖర్, క్లస్టర్ ఇంచార్జ్ హేమంబర్ గౌడు, మంజు, కష్ణ, డీకే చంద్రశేఖర్, వెంకటరమణ, రామచంద్ర, రాజారాం భాస్కర్, విజయ్, మంజునాథ్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 25 వేల మంది ఉపాధ్యాయులకు మూడు నెలలుగా ప్రభుత్వం జీతాలు చెల్లించలేదని ఎపిటిఎఫ్ 1938 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం డీఈఓ కార్యాలయం ముందు ఈ మేరకు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. మీడియాతో మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బదిలీలు చేపట్టిన అనంతరం బదిలీ అయిన ఉపాధ్యాయులకు, ఉద్యోగోన్నతిపై నియమించిన ఎంఈఓ-2లకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 25 వేల మందికి జీతాలు చెల్లించలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని ఆరోపించారు. తక్షణం వారికి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలోని ఉపాధ్యాయసంఘాలు పెద్దఎత్తున నిరసన చేపట్టిన, విద్యాశాఖ మంత్రి దష్టికి తీసుకుని వచ్చిన, మూడు నెలలుగా కేడర్ స్ట్రెంత్ పేరుతో కాలయాపన చేస్తుందని విమర్శించారు. జీతాలను తక్షణం చెల్లించకపోతే పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చెంగలరాయ మందడి, కిరణ్ నాదముని, సమీర్, దాము, లక్ష్మణమూర్తి, మణి పాల్గొన్నారు.

నేటి నుంచి వేణుగోపాలస్వామి తెప్పోత్సవాలు

ప్రజాశక్తి- కార్వేటినగరం: ఈనెల 28 నుంచి టీటీడీ ఆధ్వర్యంలో వేణుగోపాల స్వామి తెప్పోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి సురేష్ కుమార్ తెలిపారు. ఆలయ అధికారి మాట్లాడుతూ 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఆలయంలో ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామివారి కపకు పాత్రులు కావాలన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని దేవదొడ్డి గ్రామ సచివాలయాల పరిధిలోని దేవదొడ్డి, కుటాలవంక గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం పలమనేరు నియోజకవర్గ ఎమ్మెల్యే వెంకటే గౌడ నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 462 ఇళ్ల వద్దకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని అధికారులు, వాలంటీర్లుతో కలిసి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మొగసాల కష్ణమూర్తి, జిల్లా ఎంపీపీ అధ్యక్షులు మొగసాల రెడ్డప్ప, జడ్పిటిసి కేశవులు, వైస్ సర్పంచ్ సుధాకర్, మాజీ జెడ్పిటిసి అమరావతి కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.


సంక్షేమపథకాల లబ్ధి కరపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

భూమిపూజకి రావాలని ఎంపికి ఆహ్వానం


ఎంపి మిథున్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న మైనార్టీ నాయకులు

ప్రజాశక్తి- బంగారుపాల్యం: షాదీ మహల్ నిర్మాణానికి రావాలని బంగారుపాల్యం ముస్లిం సోదరులు ఎంపీ మిథున్ రెడ్డిని ఆహ్వానించారు. ఆదివారం తిరుపతిలో లోక్‌సభ ప్యానల్ స్పీకర్ మిథున్ రెడ్డి స్వగహం నందు మండల కన్వీనర్ పాలేరు రామచంద్రరెడ్డి, వైస్ఎంపీపీ శిరీష్‌రెడ్డి, చిత్తూరు జిల్లా వైఎస్ఆర్సిపి ఉపాధ్యక్షులు శరత్‌రెడ్డి ఆధ్వర్యంలో కలిసి షాది మహల్ శంకుస్థాపన కొరకు ఆహ్వానించారు. గతంలో ఎంపీ మిథున్ రెడ్డి చిత్తూరు జిల్లా ఎంపీ రెడ్డప్ప ఎంపీ నిధులతో రూ.50లక్షలు మంజూరు చేశారు. షాదిమహాల్ శంకుస్థాపన తేదీ అక్టోబర్ నెల 25న నిర్ణయించారు. షాదీమహల్ భూమిపూజకు ఎంపీ మిథున్ రెడ్డి, చిత్తూరు జిల్లా ఎంపీ రెడ్డప్ప, పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు రావాలని తెలిపారు. ఇందుకు ఎంపి సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డ్ సెక్రటరీ షేక్ ఫిరోజ్ అహ్మద్, మార్కెట్ వైస్‌ఛైర్మన్ సర్దార్ మసీద్ ముత్తువల్లి నూర్ అహ్మద్, జడ్పిటిసి సోమశేఖర్, మండలం మైనార్టీ అధ్యక్షుడు హిద్ధు, మండల సేవాదళ్ అధ్యక్షుడు షంషీర్, నాయకులు ప్రకాష్‌రెడ్డి, పాలాక్షిరెడ్డి, ఈశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సదుం సమీపంలోని గార్గేయ నది ఒడ్డుపై వెలసిన శ్రీ సుబ్రహ్మణ్యస్వామి దేవస్థాన ప్రాంగణంలో ఆదివారం రోటరీ క్లబ్, అరవింద్ ఐహాస్పిటల్ వారు నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో 320 మందికి పైగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 67 మందికి ఆపరేషన్ నిమిత్తం ఎంపిక చేసినట్లు వైద్యులు తెలిపారు. తిరుపతి మెటర్నటీ హాస్పిటల్ వైద్యసిబ్బంది కూడా ఈ వైద్యశిబిరంలో పాల్గొనగా వారి వద్ద 130మంది మహిళలు పలు రకాల గర్భకోస వ్యాధి సమస్యలపై చూపించుకొని వైద్యుల సలహాలు సూచనలు అందుకొని అవసరమైన వారికి మాత్రలు, మందులను సరఫరా చేశారు. వైద్య శిబిరంలో పలువురు వైద్యులు రోగులను పరీక్షించారు. వీరికి సదుం మండలం చెరుకువారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు సహాయ సహకారాలను అందజేశారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా గోపీ

ప్రజాశక్తి- కార్వేటినగరం: వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎం.గోపీని నియమించడం అభినందమయని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి కుమార్తె కపాలక్ష్మి అన్నారు. ఆదివారం జిల్లా ప్రధాన కార్యదర్శి గోపీని కపాలక్ష్మి, ఎంపీపీ లతబాలాజీ, మేజర్ పంచాయతీ కార్వేటినగరం సర్పంచ్ ధనంజయవర్మ పలువురు సర్పంచులు, నాయకులు కాలువలు కప్పి ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా కపాలక్ష్మి మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివద్ధికి అంకితభావంతో పనిచేస్తున్న గోపీని జిల్లా కార్యదర్శిగా నియమించడం సంతోషకరంగా ఉందన్నారు. అనంతరం జిల్లా కార్యదర్శిగా నియమితులైన గోపి మాట్లాడుతూ జిల్లా కార్యదర్శి హోదానిచ్చి బాధ్యతను మరింత పెంచారని, పార్టీ విజయానికి కషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శేఖర్రెడ్డి, అనిల్ కుమార్, యుగంధర్ నాయుడు, శేషాద్రి, నాగమణం పాల్గొన్నారు.

గోపిని అభినందిస్తున్న మంత్రి కుమార్తె కృపాలక్ష్మి

'కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయండి'

ప్రజాశక్తి-వెదురుకుప్పం: జీడీనెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీని బలోపేతం చేయాలని అసెంబ్లీ కన్వీనర్ కలికిరి నారాయణస్వామి అన్నారు. ఆదివారం వెదురుకుప్పంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కందుకూరి హుమేష్ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ త్వరలో నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో సమర్థులైన కార్యకర్తలను గుర్తించి ఆయా విభాగాలకు అధ్యక్షులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. రాబోవు ఎన్నికల్లో ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీజేపీ, వైసీపీ ప్రభుత్వాలను గద్దెదింపడం ఖాయమన్నారు. జీడీ నెల్లూరు నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ సోడెం నరసింహులు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోటీ పడి మరీ ధరలు పెంచుతున్నాయని అన్నారు. కేంద్రం పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు పెంచితే రాష్ట్రం విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెంచుతూ పోతోందన్నారు. ఇలాగే కొనసాగితే ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెపుతారన్నారు. ఈకార్యక్రమంలో జీడీ నెల్లూరు అసెంబ్లీ సమన్వయ కమిటీ సభ్యులు పోటుగారి భాస్కర్, డి.కన్నన్, ఏపీసీసీ కార్యదర్శి ఏపీ పరదేశి, కార్యకర్తలు ఎన్.సుబ్రహ్మణ్యం రెడ్డి, మునికష్ణారెడ్డి, దావుద్ బాష, ధనశేఖర్, యువరాజు తదితరులు పాల్గొన్నారు.

30న మండల మీట్

ప్రజాశక్తి -గంగాధరనెల్లూరు: ఈనెల 30వ తేదీ బుధవారం ఉదయం 10గంటలకు గంగాధర నెల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అనిత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీదేవి తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, వైస్ ఎంపీపీలు, జడ్పీటీసీ, సర్పంచ్ లు, ఎంపీటీసీలు పాల్గొనాలని కోరారు. అధికారులు ఆయా శాఖలకు చెందిన నివేదిక వివరాలతో హాజరు కావాలని ఆమె తెలిపారు.

మూల విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సదుం సమీపంలోని దిగువ జాండ్రపేటలో శ్రీ పార్వతీ సమేత అరుణాచలేశ్వర స్వామి వారి నూతన విగ్రహ ప్రతిష్ట, కుంబాభిషేకం కార్యక్రమాలలో భాగంగా ఆదివారం మూల విగ్రహ ప్రతిష్ట, ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఉదయం నుండి గణపతి పూజ, యాగశాల ప్రవేశం, కుంభారాధన, నవ కలశ స్నపన, నవగ్రహ, రుద్ర హెూమం శాంతి హెూమం నిర్వహించారు. సాయంత్రం వేద పారాయణం, గోపుర కలశప్రతిష్ట, సహస్ర నామార్చన, హారతి నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

హిందీ ఉపాధ్యాయుల సంఘం డైరీ ఆవిష్కరణ

పుత్తూరు టౌన్: తిరుపతి జిల్లా హిందీ ఉపాధ్యాయుల సంఘం డైరీ ని జిల్లా విద్యా శాఖ అధికారి డా.వి.శేఖర్ ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షులు డా.ఎన్.శ్రీరాములు, సెక్రెటరీ బి. ఉదయకుమార్ పాల్గొన్నారు.

1 నుంచి 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ

కోట : సెప్టెంబర్ ఒకటవ తేదీ నుండి 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి తూపిలి రాధాక్రిష్ణారెడ్డి తెలిపారు. కోటలో విలేకరులతో మాట్లాడుతూ నారా చంద్రబాబునాయుని తిరిగి సిఎంగా చేసుకుంటే మహానాడులో ప్రకటించిన మినీ మేనిఫెస్టోను అమలు చేస్తారన్నారు. ఈ విషయాన్ని ఈ కార్యక్రమం ద్వారా జనంలోకి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు.

గోపాల్ రెడ్డి సేవలు చిరస్మరణీయం

కోట : నేదురుమల్లి బాలకష్ణారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల తొలి ప్రిన్సిపాల్, డైరెక్టర్ గా విధులు అందించిన డాక్టర్ ఐ.గోపాల్ రెడ్డి సేవలు అమోఘమని ప్రస్తుత ఎన్బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డా.వి. విజయ్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా కోట మండలంలోని ఎన్ బి కే ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణంలో డాక్టర్ ఐ. గోపాల్ రెడ్డి ఆరో వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాజీ ముఖ్యమంత్రి, ఎన్ బి కే ఆర్ కళాశాల స్థాపకులు నేదురుమల్లి.జనార్దన్ రెడ్డి కి గోపాల్ రెడ్డి అతి సన్నిహితులు గా ఉండి ఆయన ఇచ్చిన తోడ్పాటుతో కళాశాలను ఎంతగానో అభివద్ధి చేశారని తెలిపారు. అనంతరం నేదురుమల్లి రాంకుమార్ రెడ్డితోనూ అణుకువగా ఉండి కళాశాల ఎదుగుదలకు ఉపయోగపడ్డారని గుర్తు చేశారు.

బీఈపిసీ ఖాతాలో మరో అవార్డు

ప్రజాశక్తి-వరదయ్యపాలెం

ఆదివారం గుంటూరు ఆంధ్ర క్రిస్టియన్ కాలేజీలో అఖిల భారత ఎన్జీవో సంక్షేమ సంఘం ఫౌండేషన్ 5వ వార్షికోత్సవం సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో వివిధ రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సేవకులను జాతీయ సేవా రత్న అవార్డులను అందించారు. ఇందులో భాగంగా వరదయ్యపాలెం కు చెందిన బెటర్ ఎడ్యుకేషన్ ఫర్ పూర్ చిల్డ్రన్ ఫౌండేషన్ అధ్యక్షుడు రియాజ్‌ని జాతీయ సేవా రత్న పురస్కారంతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవార్డు రావడం మరింత బాధ్యతను పెంచిందని, దీని స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తానని అన్నారు. సహకారం అందిస్తున్న మిత్రులకు శ్రేయోభిలాషులకు ఈ అవార్డు అంకితం చేస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అప్పి రెడ్డి, గుంటూరు డిప్యూటీ మేయర్ సజీల తదితరులు పాల్గొన్నారు.

కూలిన మంగళం డిపో ప్రహరీ గోడ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి-కరకంబాడి మార్గంలోని మంగళం ప్రజా రవాణా డిపో ప్రహరీ 130 మీటర్లు గోడ కూలిపోయింది. శనివారం రాత్రి మంగళంలో కురిసిన వర్షానికి డిపో ప్రహరీ గోడ కూలిపోయిందని మంగళం డిపో మేనేజర్ భాస్కర్ తెలిపారు. ప్రహరీ వెంట చెట్లు వేర్లు పెద్దగా ఏర్పడడం వలన గోడ కూలిపోయినట్టు అభిప్రాయపడుతున్నామన్నారు. త్వరలో కూలిన ప్రహరీ గోడ భాగాన్ని నిర్మిస్తామని తెలిపారు.

ఫోటో: కూలిపోయిన ప్రహరీ గోడ.

దొంగోట్లపై నిఘా ఉంచాలి : పులివర్తి వినీల్

పాకాల : టిడిపి నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు దొంగోట్ల నమోదుపై నిఘా ఉంచాలని చంద్రగిరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని తనయుడు వినీల్ అన్నారు. ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో భాగంగా ఆదివారం పులివర్తి వినీల్ ఆధ్వర్యంలో పాకాల, పుదిపుట్ల బైలు, పేరసానిపల్లె పంచాయతీల లో యువతతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామలపై చర్చించారు. నియోజకవర్గంలో దొంగోట్లపై నిఘా ఉంచాలన్నారు.

బస్సుయాత్రను జయప్రదం చేద్దాం : సిపిఐ

గూడూరు రూరల్ : మతోన్మాద పాలకుల నుండి దేశాన్ని, అవినీతి పాలకుల నుండి రాష్ట్రాన్ని కాపాడాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్. ప్రభాకర్, నియోజకవర్గ కార్యదర్శి జీ. శశికుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం గూడూరు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సమితి సమావేశం సీనియర్ నాయకులు సీతాభాస్కర్ రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ రెండవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులు, మైనారిటీలపై దాడులు అధికమయ్యాయన్నారు. సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఆగస్టు 16 నుంచి సెప్టెంబర్ 8 వరకు బస్సు యాత్ర జరుగుతుందన్నారు. తిరుపతిలో జరిగే ముగింపు సభను జయప్రదం చేయాలని కోరారు.

టిటిడి బోర్డు సభ్యుల నియామకంపై పునరాలోచించాలి : బిఆర్ఎస్

తిరుపతి టౌన్ : తిరుపతి అనంతవీధి కూదలి నందు గల బిఆర్ఎస్ కార్యాలయం నందు నూతన తితిదే పాలకమండలి సభ్యుల నియామకంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పునరాలోచించాలని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్కాట్ కష్ణప్రసాద్ కోరారు. అయన మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తితిదే నందు పాలకమండలి సభ్యులుగా లిక్కర్ స్కాంలో నిందితుని, మెడికల్ కౌన్సిల్ అక్రమ ఆరోపణలను ఎదుర్కుంటున్న మరో నిందితునికి అవకాశం ఇవ్వడం చాలా దారుణమన్నారు.

అందర్నీ కలుపుకుని పోవాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

అందరిని కలుపుకుని ముందుకు పోవాలని వన్నిరెడ్డి జాగతి సంక్షేమ సంఘం నూతన కార్యావర్గానికి ప్రముఖ కాంట్రాక్టర్ సుబ్రహ్మణ్యం రెడ్డి సూచించారు. ఆదివారం ఆయన శ్రీకాళహస్తి వన్నె రెడ్డి జాగతి సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లెంబాకం మునికష్ణారెడ్డిని దుశ్శాలువతో సత్కరించారు. వన్నె రెడ్లకు ఎలాంటి కష్టం ఎదురైనా సంక్షేమ సంఘం అండగా నిలబడుతుందన్నారు.

ధర్మరాజు స్వామి వారి బ్రహ్మోత్సవాలలో మధుసూదన్ రెడ్డి

ఏర్పేడు : పాపా నాయుడు పేట శ్రీ ద్రౌపది దేవి సమేత ధర్మరాజు స్వామి వారి బ్రహ్మోత్సవం, అగ్నిగుండం మహెూత్సవం సందర్భంగా పాల్గొన్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, గున్నేరి కిషోర్ రెడ్డి దర్శించుకున్నారు. తదనంతరం ఎమ్మెల్యే చేతుల మీదగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏర్పేడు సీఐ శ్రీహరి, చేనేత సంఘం సభ్యులు మాజీ చైర్మన్ అర్జున్ బాబు, ఏం సి బాబు, మాధవయ్య పాల్గొన్నారు. ఎంఎల్‌సి సిపాయి సుబ్రమణ్యం దర్శించుకున్నారు.

ఎస్వీయూ పోలీస్ స్టేషన్లో వైసిపి విద్యార్థి సంఘం నేతలు

క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో గత ఐదు రోజులుగా అకాడమిక్ కన్సల్టెంట్ హోదాను అసిస్టెంట్ ప్రొఫెసర్ కాంటాక్ట్ గా మార్చాలని వివిధ రకాలుగా నిరసన వ్యక్తం చేస్తున్న వైసీపీ పెద్దిరెడ్డి గ్రూపుకు చెందిన నాయకులను ఆదివారం పోలీస్ స్టేషన్లో నిర్బంధించారు. శనివారం సాయంత్రం తొమ్మిదిన్నర గంటల వరకు ఉధతమైన వర్షంలో కూడా తమ హోదాను మార్చాలంటూ విసి కారుకు అడ్డుపడి తమ నిరసన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సోమవారం జరిగే సీఎం కార్యక్రమంలో తమకు అపాయింట్మెంట్ ఉందని చెప్పినట్లు సమాచారం అందిందని సీఐ మురళీమోహన్ ఆ సంఘం నేతలను స్టేషన్కు పిలిపించి నిర్బంధించారు.

వైభవంగా అగ్నిగుండ ప్రవేశం

పుత్తూరు టౌన్ : పట్టణంలోని ద్రౌపది సమేత శ్రీధర్మరాజుల వార్షిక బ్రహ్మోత్సవాలు (తిరునాళ్ళ)అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఉదయం పురవీధుల్లో నుంచి. ధర్మరాజులు. ఊరేగింపు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు చేరుకొని. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు భక్తులు. అగ్నిగుండంలో ప్రవేశించే భక్తులు. కంకణం కట్టుకొని పూలను ధరించుకొని భక్తి శ్రద్ధలతో మంచినీళ్ల గుంట. దేవుణ్ణి స్మరించుకుంటూ. అగ్నిగుండం వద్దకు చేరుకున్నారు. సాయంత్రం అగ్నిగుండంలో ప్రవేశించి మొక్కులు తీర్చుకున్నారు.

ద్రౌపతి దేవి బ్రహ్మోత్సవాల్లో స్కౌట్స్ సేవలు

పుత్తూరు టౌన్:పట్టణంలో మూడు రోజులపాటు ద్రౌపతి బ్రహ్మోత్సవాలు నందు 200 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ విశిష్టసేవలను అందించినవారిని డిఎస్‌పి శ్రీనివాసులు ప్రత్యేకంగా అభినందించారు. భక్తుల రద్దీని దష్టిలో ఉంచుకొని క్యూలైన్‌లను క్రమబద్ధీకరిస్తూ, తోపులాట్ల జరగకుండా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సేవలందించారు. రథోత్సవానికి ఇరువైపులా భక్తుల రద్దీని క్రమబద్ధీకరించారు. స్కౌట్ మాస్టర్ వెంకటేశ్వర్లు, జయదేవ్, గైడ్ కెప్టెన్ రోజా, రేంజర్ లీడర్ భువనేశ్వరి, శైలజ, ఎంఎం రమ్య, రిషిక పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు 'సమగ్ర సంక్షేమ బోర్డు' ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

పాలక ప్రభుత్వాలపై ఆధారపడకుండా తమకు తాముగా ఉపాధి పొందుతున్న ఆటో కార్మికుల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సమగ్ర సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.బాలసుబ్రమణ్యం డిమాండు చేశారు. జీవో నం.21ని తక్షణమే రద్దు చేసి ఆటో కార్మికులపై అక్రమ జరిమానాలను అరికట్టకుంటే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం ఆ సంఘం అనుబంధ తిరుపతి జిల్లా ఆటో కార్మికుల యూనియన్ ప్రప్రథమ మహాసభను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల కారణంగా నిత్యావసర ధరలతో పాటు పెట్రోల్, డీజిల్, గ్యాస్, ఆటో మొబైల్ స్పేర్ పార్ట్స్ ధరలు విపరీతంగా పెరిగాయని వాపోయారు. ఆటో రిపేర్లకే పెట్టుబడుల్లేని దుర్భర స్థితిలో కేంద్రం తీసుకొచ్చిన మోటారు వెహికల్ సవరణ చట్టం 2019, జీవో నం.21 ఆటో కార్మికుల నడ్డి విరుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్, ఆర్టీవో అధికారులు అక్రమ జరిమానాలు, ఈ-చలాన్లు వేస్తూ ఆటో కార్మికుల జీవితాలను రోడ్డున పడేస్తున్నారని మండిపడ్డారు. ఉన్నత చదువులు చదివిన యువతకు ఉద్యోగాలు కల్పించడంలో జగన్ ప్రభుత్వం విఫలమైందన్నారు. జీవో నం.21ని రద్దు చేయాలని కోరారు. కేరళ, తమిళనాడు తరహాలో ఆటో కార్మికుల కోసం సమగ్ర సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బ్యాంకులో నుంచి తక్కువ వడ్డీతో ఆటోల కొనుగోలుకు రుణాలు మంజూరు చేయాలన్నారు. ఆటో కార్మికుల పొట్టగొడుతున్న ఓలా, ఊబర్, ర్యాపిడో లాంటి విదేశీ కంపెనీల అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విదేశీ తరహాలో ఆటో కార్మికులపై పన్నును డీజిల్ పై వసూలు చేసి, థర్డ్ పార్టీ ద్వారా ఇన్సూరెన్స్ చేయాలని సూచించారు.

ఏపీ ఆటో ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ ప్రతిపక్ష నేతగా జగన్ ఆటో కార్మికుల పక్షాన చేసిన హామీలను అమలు చెయ్యడంలో విఫలమయ్యారని విమర్శించారు. సంక్షేమ బోర్డు ఊసేలేదన్నారు. వాహనమిత్ర పేరిట ఏడాదికి రూ.10 వేలు అందజేస్తున్నా అర్హులందరకీ అందడం లేదని వాపోయారు. రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షల మంది ఆటో కార్మికులు ఉంటే మొదటి ఏడాది 3 లక్షల మందికి, రెండో ఏడాది 2లక్షల మందికి మాత్రమే వాహన మిత్ర సాయమందిందని వివరించారు. మూడో విడతలో మరి ఎంతమందికి సాయం చేస్తారో అర్థం కాని పరిస్థితి నెలకొందని అన్నారు. ఓవైపు వాహన మిత్ర సాయాన్ని బ్యాంకు ఖాతాలో జమ చేసీ, అదే రోజు ఆర్టిఐ, పోలీస్ శాఖ అధికారులను తనిఖీలకు పంపి ఇచ్చిన సొమ్మును జరిమానా రూపంలో ఆటో కార్మికుల నుంచి ముక్కు పిండి వసూలు చేసుకుంటున్న ఏకైక సీఎం జగన్మోహన్ రెడ్డి అంటూ ధ్వజమెత్తారు. ఐక్య పోరాటాల ద్వారా ఆటో కార్మికుల హక్కులను సాధించుకునేందుకు మహాసభ నుంచే సమర శంఖం పూరించాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య, ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి మురళి, రమణ, మనోహర్, వెంకటేష్, మురుగేష్, కుమార్, దుర్గ, గంధం మణి, పెనగడం గురవయ్య, రాజా పాల్గొన్నారు.

అధ్యక్ష కార్యదర్శులుగా బివి రమణయ్య, మురళి

గూడూరు : ప్రథమ మహాసభలో నూతన కమిటీ ఎంపికయ్యింది. తిరుపతి జిల్లా ఆటో డ్రైవర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులుగా జి.బాలసుబ్రమణ్యం, తిరుపతి జిల్లా ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులుగా బి.వి.రమణయ్య, ప్రధాన కార్యదర్శిగా తంజావూరు మురళిని ఆటో కార్మికులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆఫీస్ బేరర్స్ గా 15 మందిని, కమిటి సభ్యులుగా 18మందితో నూతన కమిటి ఎన్నికయ్యింది.